


# కమ్మనికల

## సరికొండ చలపతి

కమ్మనికల కని ఎన్నాళ్ళయ్యింది...

నైట్ డ్యూటీలు నిద్రకు, కలలకూ దూరం చేస్తున్నాయి.

తెల్లవారుజామున..మనసు పుస్తకంలో దాచుకున్న ఏ స్నేహితురాలో కలలోకి వస్తే తెల్లారంతా అదే స్పర్శ, పరిమళమూ.. రోజంతా ఉత్సాహం..

ఆ కలలన్నీ ఏవి..?

కమ్మని కలలేని జీవితం, జల లేని సాగరం ఒక్కటే. కలలంటే మరో మనిషికి ప్రమేయంలేని మనకు మాత్రమే చెందిన రెండో జీవితం..

'రాత్రి అందమైన అమ్మాయి కలలోకి వచ్చిందోయ్...' అని నేను హుషారుగా చెబితే సుధ నన్ను అసూయగా చూస్తుంది.

'ఛ.. ఏ మన్మధ రావూ నాకల్లోకి రాడేం ..' అని ఉడుక్కుంటుంది.

'కలలను కూడా కట్టుబాట్లకు బందీ చేస్తే ఎట్లా వస్తాడు..' అని నేనంటే అర్థమయ్యి కానట్టు నవ్వుతుంది..

నా కలల ప్రపంచంలోకి ఆహ్వానించేది సుధ ఒక్కర్తినే..

నైట్ డ్యూటి చేసి వచ్చి గంటయ్యింది..

నిద్ర కరుణించడంలేదు... సుధ, బాబు నిద్ర పోతున్నారు..

సుధ స్లీపింగ్ బ్యూటీ.. ప్రశాంతంగా నిద్ర పోతోంది.

నవ్వుతో జీవితాన్ని నెగ్గుకురాగల కళ ఏదో తెల్సు సుధకు.. అందుకే ఆమె మాయింటికి రాగానే అందరి మనసులను జయించేసింది.

ఇష్టమొచ్చినప్పుడు, కష్టమొచ్చినపుడు తెలుస్తుందిట స్త్రీ అసలు స్వరూపం.

సుధకు ఇష్టమొచ్చిందా బంతి పూల వనమే..

కష్టమొస్తే మాత్రం మేరు సమానం.

అంతర్గతంగా అంత శక్తి ఉన్నందుకేమో ..అంత హాయిగా నిద్ర పోతోంది... ఎన్ని సమస్యలున్నా.

సుధ తీరు అమ్మకు బాగా నచ్చుతుంది.

'అది ఈ కాలం పిల్లరా' అని ఇష్టంగా, గర్వంగా చెబుతుంది.

సుధ డొక్కలో దూరి ముడుచుకుని బాబు నిద్ర పోతున్నాడు.

వాడి పల్చని పెదాల చివర చిర్నవ్వు వెలుగుతోంది.

కలలో ఏదో కార్టూన్ ఛానల్ చూస్తున్నట్టున్నాడు.

ఏమైనా జీవితంలో బాల్యమే అందమైన స్వప్నం... ఆ స్వప్నంలోంచి జారి జీవితంలో పడతాం.

పక్కలో నేను దొర్లుతూంటే అనేకానేక ఆలోచనలు కమ్ముకుంటున్నాయి. ఇంకా అలాగే కదులుతూ ఉంటే వారికి నిద్రా భంగం అవుతుందని లేచి మెల్లగా బయటికి నడిచా..

పక్కన రూమ్‌లో అమ్మ నిద్ర పోతోంది. చిన్నగా ఘంటసాల శ్లోకాలు వినిపిస్తున్నాయి ఆమె రూమ్ లోంచి. టేప్ రికార్డర్ ఆఫ్ చేయకుండానే నిద్ర పోయి వుంటుంది.

అమ్మ జీవితంలో కష్టాలన్నీ 'దైవం' ఆలంబనతోనే నెట్టుకొచ్చింది... మరో మార్గం కూడా లేదు. యుద్ధరంగంలో ఏ ఆయుధమూ లేకపోతే 'నమ్మకం' ఒక్కటే మిగిలేది... అందుకే దేవుడు ఎవర్ గ్రీన్

చప్పుడు చేయకుండా హాల్లోకి వెళ్ళా... కిటికి తెరిచి చూస్తే.. దయ్యాల్లా నిలుచున్న అపార్ట్ మెంట్లు..

ప్రపంచమంతా నిద్ర పోతున్నపుడు మనమొక్కరమే మేలుకుని వుంటే.. పాదరసంలా జారిపోయే కాలం మెల్లగా కదులుతుంటుంది.

కాలం 'స్లోమోషన్'లో నడుస్తుంటే జీవితం 'డిటెయిల్స్' ఎక్కువగా కనపడతాయి.. వాటిలో ముఖ్యంగా చేదు జ్ఞాపకాలు..

నిద్ర రాకుంటే దాని స్థానంలో ప్రవాహంలా అనేక దృశ్యాలు..అనేక ప్రశ్నలు పరుస్తూ.. జవాబులకు అతీతమైన చిక్కు ప్రశ్నలు

ప్రతి ప్రశ్న వెనుక జీవితపు అసంబద్ధత ప్రస్తావనే..

ఆ ఆలోచనలు, ప్రశ్నలు దూరం చేయాలని టీవీ ఆన్ చేసి 'మ్యూట్'లో పెట్టి చూస్తూ కూర్చున్నా..

పొద్దుట్నించీ అరగంటకోసారి చూపిస్తున్న ఎన్‌కౌంటర్ దృశ్యాలే మళ్ళీచూపిస్తున్నారు. కెమెరా మెన్ తన సృజనాత్మకతతో కావల్సినంత బీభత్సంగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నాడు. శవాల మధ్య విజయగర్వంతో పోలీసు అధికారులు... చేతిలో ఆయుధాలతో. ప్రజాస్వామ్యమే ఇంత అందంగా ఉంటే... ఇక రాజరికం, సైనిక పాలన సంగతేమిటి... మళ్ళీ ఆలోచనలు ప్రశ్నలవుతున్నాయి. 'అమ్మ రూమ్ నుంచి ఘంటసాల గానం వినపిస్తోంది సన్నగా..

'పక్షులలో గరుత్మంతుడిని... జంతువులలో సింహాన్ని.. నేనేనంటూ అర్జునుడికి కృష్ణ పరమాత్ముడి క్లాస్..

నాకు నవ్వు వచ్చింది... టీవీలో సన్నివేశానికి ఆ శ్లోకానికి పోలిక తోచింది.

'నక్సలైటులో పెద్ద నక్సలైటును..పోలీసులలో పెద్ద పోలీసును నేనే... అనివార్యమగు ఈ ఎన్‌కౌంటర్ల గురించి చింతించవలదు...' అని పౌర హక్కుల సంఘానికి బోధిస్తున్నట్టుగా ఉంది..

చూశారుగా నిద్ర లేమి మెదడును ఎలా వక్రమార్గం పట్టిస్తుందో.

అందుకే టీవీ కట్టి పెట్టి నిద్రకు ప్రయత్నించడమే మంచిదనిపించి దాన్ని ఆఫ్‌చేసి బెడ్‌రూమ్ వైపు నడిచా.

అమ్మ రూమ్‌లో టేప్‌రికార్డర్ మోగుతూనే ఉంది. ఆఫ్ చేసి వెనకుకు వస్తూ అమ్మ వైపు చూశా..

గాఢనిద్రలో ఉన్నట్టుంది... ముఖం విచిత్రంగా వెలుగుతోంది... వింత కాంతి కనిపిస్తోంది

అమ్మ ముఖంలో అంత అద్భుతమైన ఫీలింగ్ ఎప్పుడూ చూడలేదు.

కమ్మనికల కంటున్నట్టుంది... అలాగే చూస్తుండిపోయా.

పద్నాలుగేళ్ళకే సంసారంలో అడుగుపెట్టిన అమ్మ ఏనాడూ సుఖపడి ఎరుగదు.

నాలుగుగోడల మధ్య హింస ఎంత దారుణమో దానికి ఆమె ఓ ఉదాహరణ... నేనే ప్రత్యక్షసాక్షి..

గృహ హింస... అది నిరంతర సజీవ దహనం.. మంటలు, ఆర్తనాదాలు బయటికి రాకుండా సాంప్రదాయాలు, కట్టుబాట్లు, బాధ్యతలు నిరం తరం కాపలా కాస్తుంటాయి.

తరాల తరబడి సమాజం మౌనంగా అంగీకరిసున్న ఈ హింస వెయ్యి హత్యల పెట్టు ...

ఎప్పటికీ దొరకని మనుశర్మలు లక్షలాది మంది ఉంటారు మనమధ్యే.

లోకానికి ధర్మరాజులాగా కనిపించే భర్త తన దగ్గరికి వచ్చేసరికి ఎందుకు యమధర్మరాజులా మారిపోతాడని అమ్మ వాపోతుంది... చావు తప్ప మరో మార్గం లేదని బాధపడుతుండేది...

మా భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని మనసురాయి చేసుకునేది.

జీవితాన్ని రద్దుచేసుకోవడానికి సిద్ధపడిన సాహసి. వివాహ బంధాన్ని రద్దు చేసుకోక పోవడం నాకెప్పుడూ ఆశ్చర్యమే.

అరవై ఏళ్ళ వయస్సులోనైనా 'ఈ మొగుడు నాకొద్దు ...' అంటూ ఆమె నిర్ణయం తీసుకోవడం నా జీవితంలో అపురూప సన్నివేశం..

బహుశా అది ఆమెకు పునర్జన్మ.

ఈమధ్య వచ్చిన గృహహింస చట్టం గురించి వివరాలు చెబితే ఎంతో సంతోషించింది. చాలా ఆలస్యం అయినందుకు బాధపడింది.

'చట్టమొక్కటే చాలదు... దాన్ని వాడుకోగలిగే వాతావరణం, మనోస్థయిర్యం అమ్మాయిలలో కల్పించాలి.. అప్పుడే ఉపయోగం... నలభై ఏళ్ళ క్రితం వుచ్చులోంచి బయట పడాలని ఉన్నా నాకు ఏ ఆలంబనలేకపోయింది. ఈ కాలం అమ్మాయిలు తమ కాళ్ళ మీద నిలబడగలుగుతున్నారు. ఈ చట్టాన్ని బాగా వాడుకోగలుగుతారు..' అంది.

చట్టంమాటెలా ఉన్నా ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే అమ్మ జీవితం మరోలా ఉండేది..

***

అమ్మ ముఖం అలాగే వెలుగుతోంది. ఏం కల కన్నదో పొద్దున్నే అడగాలనుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వచ్చా.

తెల్లారి లేచేసరికి బాగా పొద్దుపోయింది. స్కూలుకు తయారుకావడం అనే యుద్ధకాండ నడుస్తోంది బాబుకు సుధకు మధ్య... అమ్మ నవ్వుతూ చూస్తోంది..సుధ ప్రయాసను...

'మేం ఇంతమందిని కని ఎలా సవరించామో తెలిసొస్తోందా మీకు..' అని నన్ను చూస్తూ అంది..

మొత్తానికి వాడు రడీ అయ్యాడు. నేను స్కూల్లో దింపి వచ్చేసరికి అమ్మ హాల్లో కూర్చుని టీవీ చూస్తోంది. నేను ఆమె పక్కన కూర్చుని పేపర్ తీసాను.. ఇంతలో రాత్రి అమ్మ ముఖం గుర్తుకు వచ్చింది.

కాస్త దగ్గరికి జరిగి భుజం చుట్టూ చేయి వేసి.. 'అమ్మా... రాత్రేమో కమ్మని కల కన్నట్టున్నావ్..మన వడితో ఆడుకున్నావా ఏమిటి..'

సుధ చాయ్ తెస్తూ...'ఈ కలల గొడవేమిటి నీకు..' అని విసుక్కుంది. నేను అప్పుడప్పుడు కలల గురించి సుధను సతాయిస్తుంటాను...

అమ్మ నవ్వుతూ– 'అవును.. రాత్రి మంచి కల వచ్చింది..'

అంతలోనే ముఖం కాస్త సీరియస్‌గా మారింది. కాసేపు మౌనం.

'ఎన్నో ఏళ్ళుగా నేను కంటున్నకల. ఎప్పుడూ నిజం కాలేదు..'

'ఏంటది' సుధ ఆసక్తి అడుగుతూ 'నీలాగే అత్తయ్య కూడా అందమైన కలలుకంటోంది... అదృష్టవంతులు..' అన్నది.

అమ్మ మెల్లగా చెబుతోంది...

'కమ్మని కల.. ఎంత అద్భుతమైన దృశ్యం.. ఎంత హాయి.. ఎప్పుడో మా అమ్మ ఒళ్లో ఉండేది అంత హాయి.. నానుంచి నేను విడిపోయి... ఈ భౌతిక దేహాన్ని వదిలేస్తూ శూన్యమయి... మేఘాలలో తేలిపోతూ.. క్రమక్రమంగా మా అమ్మ గర్భంలోకి చేరిపోతున్నా... మృత్యువు అచ్చు మా అమ్మలా ఉంది.. మరణం ఇంత హాయిగా ఉంటుందా అనిపిస్తోంది.. ఎన్నో ఏళ్లుగా ఇదే కల.. ఎన్నడూ నిజం కాని కల...'

అమ్మ కళ్ళలో తడి... సుధదీ అదే పరిస్థితి..

అమ్మ జీవితానికి అద్దంపట్టే కల....

నా మనసులోంచి చాకు దూసుకు పోతున్న సవ్వడి.

★

